క్లుప్తంగా

శాకంబరిగా దుర్గమ్మ


హైస్కూల్ వద్ద కనకదుర్గమ్మ

జంగారెడ్డిగూడెం: ఆషాఢ మాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా స్థానిక అశ్వారావుపేట రోడ్డులోని హైస్కూల్ వద్ద ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. జంగారెడ్డిగూడెం కొత్త మున్సిపాలిటీ ఆఫీస్ సమీపంలో వేంచేసియున్న ముత్యాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

శాకంబరిగా విజయ కనకదుర్గమ్మ

పోలవరం రూరల్: మండలంలోని గూటాల గ్రామంలో గోదావరి నదీ తీరంలో వేంచేసియున్న విజయ కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి ఆషాఢమాసం శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

అమ్మవారికి వెండి సమర్పణ


వెండి సమర్పిస్తున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: స్థానిక నూకాలమ్మ ఆలయంలో శుక్రవారం విశేష పూజలు చేశారు. అమ్మవారి వెండి చీర తయారీకి గద్దే పార్థసారథి, దేవీప్రసన్న దంపతులు 10 తులాలు, ఊదర నాగేశ్వరరావు దుర్గాంబ దంపతులు, వారి కుటుంబ సభ్యులు 25 తులాల వెండిని సమర్పించారని ఆలయ చైర్మన్ రాజాన సత్యనారాయణ తెలిపారు. ఆలయంలో శ్రావణమాసోత్సవాల్లో భాగంగా ఈనెల 9వ తేదీన లక్ష పసుపు కొమ్ములతో అమ్మవారిని అలంకరించనున్నట్టు పేర్కొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం


రోడ్డు పనులను ప్రారంభించిన నాయకులు

కొయ్యలగూడెం: బోడిగూడెం పంచాయతీ అంకాలగూడెం గ్రామంలోని సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ప్రారంభించారు. రూ.6 లక్షల మండల పరిషత్ నిధులతో రేపల్లెవాడ రోడ్డు నుంచి తూర్పు వైపు ఆంజనేయస్వామి విగ్రహం వరకు రోడ్డు నిర్మించనున్నట్టు పంచాయతీరాజ్ ఇ.సురేష్ తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు కూటమి నాయకులు పాల్గొన్నారు.

దంత సంరక్షణ పట్ల శ్రద్ధ అవసరం


విద్యార్థినికి దంత పరీక్షలు చేస్తున్న దృశ్యం

చింతలపూడి: పిల్లలకు దంత సంబంధ వ్యాధులు రాకుండ తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని ప్రముఖ దంతవైద్య నిపుణుడు బి.రాంబాబు నాయక్ సూచించారు. మండలంలోని రేచర్ల తండా ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం శ్రీరామ్ మల్టీ స్పెషాలిటీ దంతవైద్య శాల ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా దంత పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు, అవసరమైన పేస్టులు, బ్రష్‌లు అందజేశారు. విద్యార్థులు నిత్యం దంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ రాంబాబు నాయక్ సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'రోడ్ల అభివృద్ధికి కృషి చేస్తా'


విద్యార్థులతో కలిసి మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

టి.నరసాపురం: రోడ్ల అభివృద్ధికి కృషిచేస్తానని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. మండలంలోని మక్కినవారిగూడెంలో నిర్వహించిన కూటమి నాయకులు విజయోత్సవ ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మక్కినవారిగూడెం జమ్మి చెరువు అభివృద్ధికి, నిధులు మంజూరుకు కృషి చేస్తానని బాలరాజు హామీ ఇచ్చారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమాల్లో జనసేన మండలాధ్యక్షుడు అడపా నాగరాజు, నాయకులు నవీన్, మాజీ జెడ్పీటీసీ నల్లూరి వెంకట చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

వీడని వరద ముంపు


వేలేరుపాడు పెద్దవాగు వంతెన ప్రాంతంలో పొంగి ప్రవహిస్తున్న గోదావరి


నీటమునిగే ఉన్న రుద్రమకోట రహదారి

- భద్రాచలం వద్ద ప్రమాద హెచ్చరికల ఉపసంహరణ
- జలదిగ్బంధంలోనే గిరిజన గ్రామాలు
- ముంపులోనే ఎద్దెలవాగు వంతెన
- 18 గిరిజన గ్రామాలకు తప్పని పడవ ప్రయాణం

వేలేరుపాడు: భద్రాచలం వద్ద మూడు ప్రమాద హెచ్చరికలను అధికారులు ఉపసంహరించారు. అయినా విలీన మండలమైన వేలేరుపాడు మండలాన్ని వరద వీడలేదు. ఈ మండలంలో దిగువనున్న 18 గిరిజన గ్రామాలు 14వ రోజు శుక్రవారం కూడా జలదిగ్బంధనంలోనే ఉన్నాయి. శుక్రవారం ఉదయం 10 గంటలకు భద్రాచలం వద్ద 43.6 అడుగులున్న నీటి మట్టం రాత్రి 7.30 గంటలకు 34.3 అడుగులకు చేరింది. గోదివరి


వేలేరుపాడు వస్తున్న రుద్రమకోట గ్రామస్తులు

నీటిమట్టం తగ్గుతున్నా శబరి ఎగపోటు, ఆనకట్ట తెగిపోయి ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు వస్తున్న పెద్దవాగు వరద వల్ల మండలంలో వరద ప్రభావం పూర్తిస్థాయిలో తగ్గలేదు. వేలేరుపాడు నుంచి కొయిదా వెళ్లే రహదారిలో ఎద్దెలవాగు వంతెన నేటికీ నీట మునిగే ఉంది. కొయిదా, కట్కూరు గ్రామ పంచాయతీల్లోని 18 గిరిజన గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయాయి. కొయిదా, కాచారం, పేరంటపల్లి, టేకుపల్లి, తాళ్లగొంది, పూసుగొంది, టేకూరు, కట్కూరు, సిద్ధారం, ఎడవల్లి, చిట్టంరెడ్డిపాలెం, ఎర్రతోగు తదితర గ్రామాలతోపాటు మరో ఆరు గ్రామాలు జలదిగ్బంధనంలోనే ఉన్నాయి. ఆయా గ్రామాల గిరిజనులు మండల కేంద్రమైన వేలేరుపాడుకు రావాలంటే పడవ ప్రయాణమే దిక్కైంది. వేలేరుపాడు నుంచి రేపాకగొమ్ము వెళ్లే రహదారి శుక్రవారం బయటపడింది. రుద్రమకోట వెళ్లే రహదారి పెద్దవాగు వంతెన, నడిగడ్డల ప్రాంతంలో ఇంకా నీటిలోనే ఉండటంతో రుద్రమకోట గ్రామస్తులు పడవపై ప్రయాణిస్తున్నారు. రుద్రమకోట గుట్టపైనే తలదాచుకున్న 12 కుటుంబాల వారు తమ సొంత ఇళ్లకు వచ్చేశారు. వేలేరుపాడు నుంచి రేపాకగొమ్ము గ్రామానికి వెళ్లే రహదారి బయటపడటంలో ఆ గ్రామస్తులు స్వగ్రామానికి చేరుకుంటున్నారు.

శిథిలావస్థలో డిగ్రీ విద్యార్థుల వసతి గృహం


బుట్టాయగూడెంలో శిథిలావస్థకు చేరిన బాలుర వసతిగృహం

బుట్టాయగూడెం: మండల కేంద్రమైన బుట్టాయగూడెంలో ఉన్న ప్రభుత్వ గిరిజన బాలుర వసతిగృహం శిథిలావస్థకు చేరింది. భవనం శ్లాబు సిమెంట్ పెచ్చులూడి ఊసలు బయటకు కనిపిస్తున్నారు. గుమ్మాలు, కిటికీలు పూర్తిగా పాడైపోయాయి. వర్షాలకు నీరు భవనం లోపలికి వస్తుంది. దీంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం గడపాల్సి వస్తుంది. ఈ శిథిలావస్థలో ఉన్న వసతి గృహంలో ఇంటర్, ఐటీఐ, డిగ్రీ కళాశాల విద్యార్థులు సుమారు 142 మంది చదువుకుంటున్నారు. అయితే ఈ భవనం కనీస మరమ్మతులకు కూడా నోచుకోకపోవడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. బుట్టాయగూడెంలో అధికారులు ప్రతిపాదనలు చేయడమే తప్ప మరమ్మతులు చేయించేందుకు కృషి చేయడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పూరాతన భవనం స్థానంలో నూతన భవనం నిర్మించాలని వారు కోరుతున్నారు.

ఎంఆర్‌పీఎస్ విజయోత్సవం


కన్నాపురం జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ తీర్పుపై వారం రోజుల విజయోత్సవాలు నిర్వహించనున్నట్టు ఎంఆర్‌పీఎస్ పోలవరం నియోజకవర్గ నేత సొంగ వెంకటేష్ పేర్కొన్నారు. శుక్రవారం కన్నాపురంలోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో వేడుక నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీటీసీలు ఎస్‌కే బాజీ, కె.గణపతి, మాజీ సర్పంచ్ ఎం వెంకటేశ్వరరావు, చాపల చినబాబు, కొడవటి సూర్యచంద్రం, యడ్లపల్లి అబ్బులు, ముప్పిడి కనిష్క, సొంగ రాకేష్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై హర్షం

జంగారెడ్డిగూడెం: ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వటం పట్ల బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొప్పాక శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్ వర్గీకరణ వల్ల చాలా ఉప కులాలకు మేలు జరుగుతుందని ఆయన తెలిపారు. ఎన్నికల ముందు నరేంద్ర మోదీ ఇచ్చిన హామీ ప్రకారం మాదిగ జాతికి న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. మందా కృష్ణ మాదిగ కృషి త్యాగ ఫలితంగా భవిష్యత్తు తరాలకు నాంది పలికిన ఒక ఉద్యమ కారుడిగా చరిత్రలో లిఖించబడతారని వివరించారు.

ముర్రుపాలతో వ్యాధి నిరోధక శక్తి


కొయ్యలగూడెం : రామానుజపురంలో తల్లిపాలపై అవగాహన


జంగారెడ్డిగూడెం : సాయిబాలాజీ టౌన్‌షిప్‌లో అవగాహన ర్యాలీ

కొయ్యలగూడెం: తల్లి ముర్రుపాల ద్వారా బిడ్డకు వ్యాధినిరోధక శక్తి లభిస్తుందని ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్ సుబ్రహ్మణ్యం అన్నారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవాల కార్యక్రమం రామానుజపురం గ్రామంలో శుక్రవారం నిర్వహించారు. సూపర్‌వైజర్ ఎస్‌కే చాన్‌బాషా, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది కె.మరియమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కె.కోట మండలంలో..

కామవరపుకోట: తల్లిపాలు బిడ్డకు వ్యాధి నిరోధక శక్తిని పెంచుతుందని కామవరపుకోట సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బీవీఎల్ మంగాదేవి అన్నారు. మండలంలో రావికంపాడు, కొండగూడెం గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ముర్రుపాలు ప్రాముఖ్యతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. మండల వైద్యాధికారి పీవీఎల్ ప్రసన్న కుమార్ మాట్లాడారు. ఆసుపత్రి సిబ్బంది హెచ్.వి.సరోజినీ, ఎం.ఎల్.హెచ్.పి. జ్యోతి, ఏఎన్‌ఎం తులసి, అంగన్‌వాడి సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం

బుట్టాయగూడెం: మండలంలోని కొమ్ముగూడెం, కామయ్యకుంట గ్రామాల్లో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్లు కె.ఝాన్సీ, ఎన్‌వీ సత్యవతిలు మాట్లాడుతూ తల్లిపాలతో శిశువుకు ఆరోగ్యం వస్తుందని, అమృతంతో సమానమని వివరించారు. ఆయా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. ఎంఎల్‌హెచ్‌ఎ కె.భవాని, ఏఎన్‌ఎంలు కె.గంగారత్నం, ఎం కన్నమ్మ, అంగన్‌వాడీలు కె.నాగరత్నం, కె.సత్యవాణి, గంగ చెల్లమ్మ, ఎస్ రాజమ్మ, గౌరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ముర్రుపాలు బిడ్డకు శ్రేయస్కరం

కుక్కునూరు: శిశువు జన్మించినప్పుడే తల్లి ముర్రుపాలు ఇవ్వడం బిడ్డకు శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వీఎస్ రుక్మిణి అన్నారు. కుక్కునూరు, వేలేరు సెక్టార్ల పరిధిలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీలు లక్ష్మీకాంత, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

సాయిబాలాజీ టౌన్‌షిప్‌లో..

జంగారెడ్డిగూడెం: పుట్టిన బిడ్డకు గంట లోపు తల్లి పాలు అందించాలని వైద్యులు రాంబాబు తెలిపారు. స్థానిక సాయిబాలాజీ టౌన్‌షిప్ అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ కె.జగదీశ్వరిలు మాట్లాడారు. కౌన్సిలర్ జె.మోహన్, అంబేద్కర్, ఏఎన్ఎం మణి, అంగన్‌వాడీ టీచర్లు వరలక్ష్మి, శాంతి, దేర్గాదేవి, ఆశా వర్కర్లు, హెల్పర్లు, తల్లులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డలకు ఆరోగ్యం

పోలవరం రూరల్: పుట్టిన బిడ్డకు ఆరు నెలల పాటు తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లీ బిడ్డ ఎంతో ఆరోగ్యంగా ఉంటారని వైద్యారోగ్య శాఖ సిబ్బంది అన్నారు. తల్లి పాల ప్రాముఖ్యతపై మండలంలోని వెంకటరెడ్డిగూడెం, జగన్నాథపేట, ఇటికిలకోట, పోలవరం సెంటర్లలో అవగాహన కల్పించారు. పీఎల్‌ఎస్ కుమారి పాల్గొన్నారు.

దళితులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి


పాతూరులో నిరసన వ్యక్తంచేస్తున్న గ్రామస్తులు

కామవరపుకోట: కామవరపుకోట శివారు పాతూరు అంబేడ్కర్ కాలనీ వాసులకు ఇళ్ల పట్టాలు వెంటనే మంజూరు చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన గ్రామస్తులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఎస్సీ దళితులు గ్రామంలో 40 సంవత్సరాలుగా ఇళ్లు నిర్మించుకుని ఉన్నారని, పంచాయతీ పన్నులు, కరెంటు బిల్లులు చెల్లిస్తున్నారని, సీసీ రోడ్లు నిర్మించారని ఫ్రాన్సిస్ తెలిపారు. నేటికీ ఇళ్ల పట్టాలు మంజూరు చేయకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం ఎస్సీలు పట్ల చిత్తశుద్ధితో వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో దుర్గారావు, ఎం.వీరయ్య, చిన్న దుర్గారావు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ

ద్వారకాతిరుమల: గుర్తు తెలియని వ్యక్తులు ఒక ఇంటి తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనపై శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై జి.సతీష్ తెలిపిన కథనం ప్రకారం. ద్వారకాతిరుమల గ్రామానికి చెందిన కొయ్యగూర శ్రీవల్లి, ఆమె కుమారుడు గత నెల 2న హైదరాబాద్‌లోని ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకుని, తిరిగి శుక్రవారం మధ్యాహ్నం ఇంటికి చేరుకున్నారు. అయితే తాళాలు పగలగొట్టి ఉండటంతో ఇంట్లోకి వెళ్లి చూడగా, బీరువా తలుపులు తెరచి ఉన్నాయి. అందులో రెండు కాసుల బంగారు వస్తువులు చోరీ జరిగినట్టు గుర్తించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో శ్రీవల్లి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై తెలిపారు.

వేధింపుల కేసు నమోదు

టి.నరసాపురం: వివాహిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు వేధింపుల కేసు నమోదుచేశారు. ఎస్సై డి.దుర్గామహేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాజుపోతేపల్లి గ్రామానికి చెందిన పసుపులేటి ప్రసాద్, పుష్పరాజ్యంలకు 25 సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కొంతకాలం తర్వాత ప్రసాద్ మద్యానికి, చెడు అలవాట్లకు బానిసై పుష్పరాజ్యంను శారీరంగా, మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నాడు. జూన్ 5వ తేదీన మద్యం సేవించి వచ్చి పుష్పరాజ్యంను కొట్టి, పిల్లలను, పుష్పరాజ్యంను ఇంటి నుంచి పంపివేశాడు. పుష్పరాజ్యం విషయాన్ని పెద్దల్లో పెట్టినా మార్పురాకపోవడంతో శుక్రవారం ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై తెలిపారు.

కనులపండువగా శివ కల్యాణం


శివ కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల: క్షేత్రపాలకునిగా విరాజిల్లుతోన్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామివారి ఆలయంలో శుక్రవారం ఆరుద్ర నక్షత్రం, మాస శివరాత్రి పర్వదినాలను పురస్కరించుకుని స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ మండపంలో సింహాసనంపై గంగా, పార్వతీ సమేత శివ దేవుని ఉత్సవ మూర్తులను ఉంచి కల్యాణ తంతును ప్రారంభించి, సుముహూర్త సమయంలో జీలకర్ర బెల్లం ధరింపజేసి, మాంగల్యధారణ, తలంబ్రాల వేడుకలను భక్తుల శివ నామస్మరణల నడుమ అట్టహాసంగా నిర్వహించారు. రాత్రి జరగాల్సిన స్వామివారి గ్రామోత్సవం వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో రద్దయింది.

పింగళి వెంకయ్యకు నివాళి


కుంతలగూడెం ఎంపీపీ స్కూల్లో వెంకయ్యకు నివాళులర్పిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య 148 జయంతి కార్యక్రమం శుక్రవారం కుంతలగూడెం ఎంపీపీ స్కూల్‌లో హెచ్‌ఎం రాయపూడి వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు వెంకయ్య చిత్రపటం వద్ద నివాళులర్పించారు. వెంకయ్య జీవిత విశేషాలను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. తెలుగు వాడు అయినందుకు తెలుగు రాష్ట్రాల ప్రజలు గర్వపడాలి అని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు.

జాతీయ జెండాల తయారీ ప్రారంభం


జెండాలను తయారు చేస్తున్న సభ్యులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జాతికి గర్వకారణమైన జాతీయ జెండాకు క్రయవిక్రయాలు ఉండకూడదనే నినాదంతో నగరానికి చెందిన ఘంటసాల స్వర పీఠం వ్యవస్థాపకుడు ఎస్ఎం సుభాని ఆగష్టు 15వ తేదీకి పాఠశాలలకు జెండాలను ఉచితంగా పంపిణీ చేసేందుకు జెండాల తయారీని శుక్రవారం ప్రారంభించారు. మువ్వన్నెల జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య 148వ జయంతిని ఏలూరు ఘంటసాల స్వర పీఠం ఆధ్వర్యంలో స్థానిక న్యూ అశోక్ నగర్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించారు. వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మానవత కేంద్ర నియంత్రణ కమిటీ అధ్యక్షుడు ఆలపాటి నాగేశ్వరరావు స్వాగతం పలికారు. ఇన్నర్ వీల్ క్లబ్, మానవత సంస్థల సాయంతో ఏర్పాటుచేసిన కుట్టు మెషీన్లను ప్రారంభించారు. తమ సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా పని పాట అనే కార్యక్రమాన్ని ప్రారంభించి, ఆసక్తి గల వారికి దేశభక్తి గేయాలు నేర్పిస్తున్నట్టు సుభాని తెలిపారు. ఈ సందర్భంగా గతంలో ఎయిర్‌ఫోర్స్‌లో పని చేసిన పశ్చిమగోదావరి జిల్లా మానవత అధ్యక్షుడు దేవినేని భాస్కరరావు, ఆర్మీలో పని చేసిన బీడీ నాగేశ్వరరావులను సత్కరించారు. వై.అర్జునరావు, శ్రీహరి కోటి, అడుసుమిల్లి నిర్మల, కొమ్మొజు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురికి గాయాలు

పోలవరం రూరల్: పోలవరం పంచాయతీ పరిధిలోని కడెమ్మ వంతెన వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. పంతుల రామకృష్ణ, నగిరి సుబ్రహ్మణ్యం, గోపల వెంకటేశు అనే యువకులు అదుపుతప్పి కడెమ్మ కాలువలో మోటార్ సైకిల్‌తో సహా పడిపోయారు. వీరిని సమీపంలోని వ్యక్తులు గుర్తించి రక్షించారు. పోలవరం వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అందించిన అనంతరం రాజమండ్రి వైద్యశాలకు మెరుగైన వైద్యం కోసం తరలించినట్టు సమాచారం.

రాజరాజేశ్వరీ దేవికి సారె సమర్పణ

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ప్రాంతీయ బ్రాహ్మణపరిషత్ ఆధ్వర్యంలో స్థానిక పేరంపేట రోడ్డులోని శ్రీ రాజరాజేశ్వరీ దేవి ఆలయం (శివాలయం)లో అమ్మవారికి తొలి సారెను సమర్పించారు. అధ్యక్షుడు బ్రహ్మశ్రీ చిలుకూరి సాయిబాబు మాట్లాడుతూ సర్వజనులు సుఖశాంతులతో, పాడి పంటలతో, సుభిక్షంగా ఉండాలని, ప్రపంచ శాంతిని కోరుతూ వైదిక సంప్రదాయ రీతిలో అడపడుచైన అమ్మవారికి సారె పెట్టించినట్టు చెప్పారు. అనంతరం అన్నప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు ఆషాఢం సారె


కుంకుళ్లమ్మ ఆలయానికి సారె తీసుకొచ్చిన మహిళలు

ద్వారకాతిరుమల: క్షేత్ర దేవత శ్రీ కుంకుళ్లమ్మ అమ్మవారికి, గుండుగొలనుకుంటలోని శ్రీ కండిగలమ్మవారికి గ్రామానికి చెందిన చిలుకూరి వారి మహిళలు శుక్రవారం ఆషాఢం సారెను సమర్పించారు. వారంతా పలు రకాల స్వీట్లు, పూలు, పండ్లు, చీరలు, పసుపు, కుంకుమలతో ఆలయానికి చేరుకుని, సారెను అర్చకులకు అందజేశారు. అనంతరం అమ్మవార్లకు పూజలు చేశారు.

వృద్ధులకు అన్నదానం


వృద్ధులకు భోజన వసతి కల్పిస్తున్న దృశ్యం

పోలవరం రూరల్: పోలవరంలోని మహాత్మాగాంధీ వృద్ధాశ్రమంలో వృద్ధులకు దాతల సహకారంతో అన్నదానం చేశారు. శుక్రవారం పోలవరం ప్రాజెక్టులో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ పి.రాజేష్‌కుమార్ వృద్ధాశ్రమంలోని 70 మందికి భోజన వసతి కల్పించారు.

జూదరుల అరెస్ట్

జంగారెడ్డిగూడెం: చిన్నవారిగూడెం గ్రామంలో పేకాట శిబిరంపై దాడి చేసి తొమ్మిది మందిని అరెస్ట్ చేసినట్టు హెచ్‌సీ పీసీహెచ్ శ్రీనివాసరెడ్డి శుక్రవారం తెలిపారు. వారి నుంచి రూ.1,320 నగదు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

కుక్కునూరు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పెద్దిరాజు

కుక్కునూరు: కుక్కునూరు ఇన్‌చార్జి తహసీల్దారుగా డీవీ పెద్దిరాజు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ పి.అచ్యుతకుమారి రాజమండ్రి బదిలీ కావడంతో పెద్దిరాజు బాధ్యతలు చేపట్టారు. అందరి సహకారంతో మండలంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పెద్దిరాజు తెలిపారు.